

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"ఆత్మీయులకి చెప్పరానంత కష్టం వస్తే ఆ బాధ ఎలా ఉంటుందో మాకూ తెలుసమ్మా. మాకు అవకాశం ఉంది కనక మాకు వీలైనంత సహాయం చేసి ఆ చిన్నపాప, ముఖ్యం గా అంత ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న చిన్నారి. తనకి మా వల్ల ఇసుమంత మంచి జరిగినా మాకు ఎంతో సంతోషకరం. మా మినీ చెప్పినట్టు తనకి అన్నీ అనుకూలంగా జరుగుతాయని ఆశిద్దాం. మిగతా ఫార్మాలిటీస్ అన్నీట్రస్ట్ పరంగా మా యష్ చూసుకుంటాడు. మీ అందరికీ బెస్ట్ ఆఫ్ లక్, ముఖ్యంగా పాపకి. నాకు మరో మీటింగ్ ఉంది, వెళ్ళాలి" అంటూ లేచి నిలబడ్డారు కేశవరావు.

అప్పటిదాకా నిలబడి యామిని తో మాట్లాడుతున్న రాధిక ఆయన అలా నిలబడగానే మళ్ళీ కాళ్ళకి నమస్కరించబోయింది.

అది గమనించిన ఆయన వెంటనే " వద్దమ్మా! మీరు ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోకుండా ఉండాలి, ముఖ్యంగా పాప దగ్గర. అది చాలా ముఖ్యం, పాప ఎప్పుడూ సంతోషంగా, ఉత్సాహంగా ఉండేటట్టు చూసుకోండి. సంతోషమే సగం బలం, కదా. వస్తాను" అంటూ కళ్ళ జోడు తీసి మడిచి జేబులో పెట్టుకుని ముందుకు నడిచారు. సన్నగా కంపించిన ఆయన స్వరంలో చిన్న జీర.

' థాంక్ యూ కేశవ్ సార్" ఇద్దరు డాక్టర్లూ కూడబలుక్కున్నట్టుగా ఒకేసారి అన్నారు.

" యూ ఆర్ వెల్కం. మీరిద్దరే పాపకి, వాళ్ళకీ బలం" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయారు ఆయన.

ఆయన వెళ్ళినవైపే నడిచే దైవాన్ని చూస్తున్నట్టుగా చెప్పలేనంత ఆరాధనా భావంతో చూస్తూ ఉండిపోయింది రాధిక.

తమకి కావలసిన పని అనుకున్నదానికంటే సులభంగా జరగడం ఆమెకి కలలా ఉంది.

'తమ స్వప్ని చికిత్స కి కావలసిన డబ్బు సమకూరుతుంది!' అనుకోవడమే కొండంత బలాన్నిచ్చింది ఆమెకి.

ఆమె మనసంతా ఇదీ అని చెప్పలేని సంతోషంతో పొంగిపోయింది.

ఆ పొంగు కళ్ళల్లోకొచ్చి ఆనందమో, కన్నీరో తెలియని అశ్రువులై ధార కారింది. కురుస్తున్న తడి కళ్ళని తుడుచుకోవడం కూడా మర్చిపోయినట్టు కేశవరావు గారు కనిపించినంత మేరా ఆయన వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయింది.

" కామ్ డౌన్ రాధీ, ఊరుకో ఇంక. ప్లీజ్" అనునయంగా అన్నాడు కిరణ్ ఆమె భుజం మీద చెయ్యి వేస్తూ.

మరి కాసేపట్లో సర్దుకుంది రాధిక.

" నేను చెప్పాను కదా, మీ వివరాలన్నీ మాదగ్గర ఉన్నాయి కనక మేము ఒకసారి కేస్ ప్రొసెసింగ్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి మీకు కాల్ చేస్తాం. ఐ మీన్ డాక్టర్లిద్దరికీ. అప్పటినించీ మనం అన్ని పనులు మొదలుపెడదాం. అది కూడా అస్సలు ఆలస్యం లేకుండా వీలైనంత తొందరగా. 'టైం ఈజ్ ద ఎస్సెన్స్ '. పాపని జాగ్రత్తగా చూసుకోండి." అంటూ యష్ లేచాడు.

అన్న వెనకే యామిని కూడా.

వెళ్ళేముందు రాధిక కి ధైర్యం చెప్తున్నట్టుగా ఆమె చేతిని పట్టుకుని మెత్తగా ఒత్తి, భుజం మీద తట్టింది.

కొన్ని చర్యలకి మాటలతో సంబంధం లేదు. ఆ స్పర్శకి రాధిక కి ఎంతో ఆలంబన, స్వాంతన లభించినట్టయింది.

గబ గబా కళ్ళు తుడుచుకుంది.

మరోసారి వారికి కృతజ్ఞతలు చెప్పి వచ్చిన నలుగురూ ఇంటిదారి పట్టారు. ఈసారి అందరికీ ఎంతో ఆనందం.

" ఎందుకో ఇది చాలా మంచి శకునంలా అనిపిస్తోంది కదా. స్వప్నికి తప్పకుండా తగ్గిపోతుంది. ఇది నా మనసుకు చాలా గట్టిగా అనిపిస్తోంది" అన్నారు డా.రాజేష్ అందరికంటే ముందు మాట్లాడుతూ.

"కరక్ట్. కేశవరావు గారు, వారి కుటుంబం మంచివారని తెలుసుకానీ ఇంత సులభంగా మన పని జరుగుతుందనుకోలేదు. అందరిలాగే 'మరొక సారి టెస్ట్ చేయించి ఆ రిపోర్ట్ తెండి లేదా మరొక కాగితం కావాలి 'లాంటి వన్నీ అడిగి రెండుమూడు సార్లు తిప్పుతారనుకున్నాను. ఇంత ఈజీగా జరిగిపోవడం చాలా హాయిగా ఉంది. కానీ ఇంత సులభంగా జరగడానికి ఏదైనా బలమైన కారణం ఉండి ఉండాలి అనిపిస్తోంది" అన్నారు డాక్టర్ సుజిత్ కూడా.

" మన స్వప్ని అదృష్టం" అంది రాధిక.

" నన్నడిగితే మీ లాంటి మంచి మనుషుల సంకల్పం, అదే బలం" అన్నాడు కిరణ్.

దేవుడినీ, అదృష్టన్నీ కూడా పెద్దగా నమ్మని భర్త అలా అనడం ఆశ్చర్యం కలిగించలేదు రాధిక కి.

కానీ తను కూడా ఎంతో గొప్పగా గౌరవించే డాక్టర్ల మంచితనాన్ని గురించి అతను అలా అనడం సంతోషంగా అనిపించింది.

అదొక్కటే అన్న వెంటనే కిరణ్ మౌనంగా ఉండిపోయాడు.

ఏదో కలలా జరిగినట్టనిపిస్తున్న ఉదయపు సంఘటనలనీ, కలిసిన వ్యక్తులనీ, ఆ పరిసరాలని నెమరువేసుకుంటున్నట్టుగా గుర్తు తెచ్చుకుంటూ ఉండిపోయాడు.

తమనేమీ గుచ్చి గుచ్చి వివరాలు అడగలేదు ఆ తండ్రీ పిల్లలు.

పైగా ' మీ బాధ మేము అర్థం చేసుకోగలం'

' వీ అండర్స్టాండ్ యువర్ పెయిన్' లాంటి స్వాంతనా వచనాలు చెప్పారు.

బహుశా వారికీ జీవితంలో ఇలాంటి అనుభవమేదైనా జరిగి ఉంటుందా? ముఖ్యంగా కేశవరావుగారన్నమాట. 'ఆత్మీయులకి ఏదైనా జరిగితే'.

వారి ఆత్మీయులెవరికైనా ఇలాంటి పరిస్థితి వచ్చిందా? వస్తే ఎవరై ఉంటారు? ఇలాంటివెన్నో ప్రశ్నలు అతని మనస్సులో గజిబిజిగా కదలాడసాగాయి.

'వారి జీవితంలో ఏమైతే మనకెందుకు? మనకి కావలసింది జరుగుతుండగా!" అని అనుకోలేకపోయాడు.

అలాంటివారికి అన్నీ మంచే జరగాలి అని మాత్రం గట్టిగా అనుకున్నాడు.

అదే మాట,"పాపం వారి జీవితంలో ఏం జరిగిందో? అంత మంచి మనుషులు, ముఖ్యంగా ఆ పెద్దాయన. వారిని చూస్తే నాకెందుకో జాలి వేసింది" అన్నాడు పైకే.

అతనలా అనగానే కారులో పరుచుకున్న మౌనం.

సన్నగా చేస్తున్న ఏ.సీ శబ్దం తప్ప మరేమీ వినబడలేదు. కార్ స్పీడందుకుంది.

------

తనకు మరో మీటింగ్ ఉందని వచ్చిన వారికి వీడ్కోలు చెప్పి లోపలకి వచ్చిన కేశవరావు సరాసరి తన పడకగదికి వెళ్ళారు.

చాలా పెద్ద సూట్ అది. ఆ బంగ్లాలోనే అతి విశాలమైనది.

ముందు చిన్న గదిలా ఉండి, అక్కడ కూర్చోవడానికి సోఫా సెట్. మధ్యలో అందమైన చిన్న గ్లాస్ టేబిల్. సోఫా ఎదురుగా పెద్ద టీవీ. ఒక మూలకి చిన్న ఫ్రిజ్. గోడలకి అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు. లేత రంగు కర్టెన్లూ.

కట్టినవారి అభిరుచిని చూపిస్తున్నట్టుగా అణువణువునా అందంగా, ఎలిగెంట్ గా ఉంది.

అక్కడనించి లోపల గదిలోకి వస్తే మధ్యలో వేసి ఉన్న పెద్ద మంచం, దానిమీద వేసిన మెత్తని పరుపు, తలగడలు, పైన కప్పిన లేత రంగు దుప్పట్లూ, మంచానికి రెండు వైపులా బెడ్ స్టాండ్ లు. ఎదురుగా డ్రెస్సర్.

అక్కడనించి ఎడం వైపుకు లోపలకి వెళ్తే వచ్చే బాత్ రూం కి అటూ ఇటూ చిన్న గదులంత సైజుల్లో భార్యాభర్తలిద్దరివీ బట్టలు పెట్టుకునే లాంటి అలమరలు. ఆపైనా చాలా పెద్ద బాత్రూం. రెండు వైపులా రెండు రకాల బాత్ టబ్ లు, స్టాండ్ ఇన్ షవర్ లు లాంటి అధునాతనమైన సదుపాయాలన్నీ ఉన్న పెద్ద బాత్ రూం.

చాలా అధునాతనంగా, సింపుల్ గా డిజైన్ చెయ్యబడిన మాస్టర్ బెడ్రూం సూట్ అది.

ఇంటి యజమానురాలు దగ్గరుండి తనకి కావలసిన విధంగా ప్రతీదాన్ని దగ్గరుండి కట్టించుకున్నది. ఆ మాటకొస్తే ఆ బంగళాలో ప్రతీ అణువూ ఆమె కనుసన్నల్లో, ఆమె వేసిన డిజైన్ లో కట్టినదే.

బెడ్ రూం లోంచి మరొక పక్కకి ఉన్న అటాచెడ్ బాల్కనీ. దానిలో వేసి ఉన్న ఉయ్యాల బల్ల.

ఆ బల్ల మీదే కూర్చుని ఉన్నారు కేశవ్ రావు.

వచ్చిన వారితో మాట్లాడిన తర్వాత పిల్లలిద్దరూ వెళ్ళిపోయారు. కొడుకు యష్ వెంటనే వెళ్ళిపోయాడు.

అతనొక ప్రముఖ సాఫ్ట్ వేర్ నిపుణుడు. చాలా తెలివైన వాడు. ఐ. ఐ. టీ చెన్నై లో చదివాడు. మాస్టర్స్ అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీలో చేశాడు. ఆపైనా ఈ మధ్యన బాగా ప్రాచుర్యం లో ఉన్న డేటా ఎనాలిటిక్స్ (Data Analytics), ఆర్టిఫిషియల్ఇంటెలిజెన్స్ ( Artificial Intelligence) , మెషీన్ లెర్నింగ్ ( Machine Learning) లాంటి అధునాతన రంగాల్లో చాలా ప్రావీణ్యం సంపాదించాడు.

జీనోమిక్స్ ( Genomics– జన్యుసంబంధ శాస్త్రం ), హెల్త్ కేర్ రంగాల్లో పెద్ద పెద్ద డేటా సెట్లని ఎనలైజ్ చేసి అతి కీలకమైన అంశాలని గుర్తించి, వాటిద్వారా వ్యాధులని తేలిగ్గా గుర్తించడం, చికిత్సా మార్గాలని త్వరగా కనిపెట్టడం లాంటివి చేస్తూ ఉంటాడు.

అతను పనిచేసే కంపెనీకి చాలా పెద్ద హాస్పటల్స్, రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ లతోనూ చాలా రిలేషన్ ఉండడం వల్ల వారికి రిసెర్చ్ డేటా దొరకడం కొంత తేలిక. అది ఉపయోగించి వారు వివిధ రకాల ప్రయోగాలు చేస్తూ ఉంటారు.

యామిని కూడా లైఫ్ సైన్సెస్ లో డాక్టరేట్ పూర్తి చేసుకుని ఈ మధ్యనే నగరంలోనే ప్రముఖ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ లో సైంటిస్ట్ గా చేరింది. చాలా తెలివైన, నైపుణ్యమున్న సైంటిస్ట్ గా మంచి పేరు తెచ్చుకుంది. తన రిసెర్చ్ లో భాగం గా చాలా అంతర్జాతీయ సైంటిస్ట్ లతో మంచి స్నేహాలూ, పరిచయాలు ఉన్నాయి ఆమెకి. అనేక కాంఫరెన్స్ ల లోనూ, మీటింగ్ ల లోనూ ప్రసంగిస్తూ, తన రిసెర్చ్ ని ప్రెజెంట్ చెస్తూ ఉంటుంది ఆమె.

పిల్లలిద్దరూ తాము కోరుకున్న రంగాల్లో చక్కటి పేరు తెచ్చుకోవడం ఆయనకెంతో సంతోషం గా ఉంటుంది.

స్వప్నిక కేసు గురించి వినగానే ఆయనకి అచ్చు అది యశోద కి వచ్చిన సమస్య లాగే ఉండడం కాస్త ఆశ్చర్యంగా అనిపించింది. చదివిన కొద్దీ అన్నీ చాలా వరకూ ఒకేలా ఉండడం ఆయన స్వప్నిక పట్ల అంత త్వరగా సానుకూలంగా స్పందించేలా చేసింది.

అదే సమస్యకి మరొకరు బలి కాకూడదు అనిపించడమే కారణమేమో! ఆ మాట అనుకోగానే ఆయన మనసంతా దిగులుగా అయిపోయింది

ఉయ్యాల బల్ల మీద కళ్ళు మూసుకుని కూర్చున్న ఆయన మనసంతా చెప్పలేనంత నిర్వేదన.

"టీ తేనా బాబుగారూ?" అంటూ వచ్చింది లత.

" వద్దమ్మా, కొంచం మంచినెళ్ళు తే చాలు. కాసేపు ఇక్కడే కూర్చుంటాను. తలుపు దగ్గరగా వేసి వెళ్ళు" అన్నారు ఆమె తెచ్చిన మంచి నీళ్ళు తాగిన తర్వాత.

నెమ్మదిగా ఊగుతూ, ఎదురుగా కనిపిస్తున్న తోటవైపు చూస్తూ కూర్చుండి పోయారు.

తోటలోని, ప్రతి మొక్కా, ప్రతి పువ్వూ. అన్నీ యశోదనే గుర్తు తెస్తాయి, అసలు మర్చిపోతే కదా ప్రత్యేకంగా గుర్తు రావడానికి.

ఆమె దూరమైన ఈ మూడేళ్ళలో ఒక్క క్షణమైనా మర్చిపోగలిగారా తాము ముగ్గురూ...

.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments